
# జీవితానందం

# కడుపు గాల్చిన కన్నకూతురు

# సృష్టి

చెహోవ్ • నామిని • బెర్ట్రాండ్ రస్సెల్





తేజోవతి

Blank page

# దుఃఖం
# ఒక జీవితేచ్ఛ !

ఏ సందర్భాన్నైనా పుస్తకాలతో పంచుకోవడం మా అలవాటు. మా తోడ బుట్టిన మా అక్క శ్రీమతి చంద్రకాంతమ్మ కుమార్తె, అంతకు మించి మా తమ్ముడు ప్రభాకర్ సతీమణి శ్రీమతి తేజోవతి ఆ ముందురోజు దాకా మా మధ్య సందడి సందడిగా తిరుగులాడుతూ... వున్నట్టుండి మరణించింది. ఇది మా కుటుంబానికి భరించలేని దుఃఖమే. ఈ సందర్భంలో మాకు రష్యన్ మహా రచయిత చెహోవ్ గారి 'జీవితానందం' అనే చిన్ని కథ గుర్తుకొచ్చింది. జరిగిన దాంట్లోంచి జరగని దాన్ని చూడు- అని యీ కథ సారాంశం. మా తేజోవతి మరణించిందే కానీ ఎద్దు కొమ్ముల్లాంటి యిద్దరు కొడుకుల్ని కని, సాకి - ఆ యిద్దరు బిడ్డల్నీ వేలు పట్టి నడిపించవలసిందిగా మేనమామలైన మాకు అప్పగించి, తల వంచుకు వెళ్లి పోయింది. ఈ బాధ్యతే మాలో జీవితేచ్ఛను రగిలించింది!

ఏ చిన్న కష్టమొచ్చినా మన భారతీయ గ్రామీణ మహిళ 'కూలిపొయ్‌న దేముడా!' 'నా బట్టా దేముడా!' అని దేముణ్ణి సంబోధించడం సర్వసాధారణం. ఇది దైవ దూషణ గాదు, దేవునికి మొర పెట్టుకోవడం! కడుపు గాల్చి కన్న కూతురు కాటికెళ్లిపోతే, అప్పుడా తల్లి, 'నా బట్టా దేముడా!' అని యాష్టపోతే ఆ దేముడు కూడా ఆ తల్లితో పాటు కండ్ల నీళ్లు పెట్టుకున్నట్టుగా చిత్రకారుడు బాపు - కథ కంటె మించి చిత్ర కల్పన చేశారు. కథ చదవండి, బొమ్మ చూడండి.

ప్రపంచ తత్వవేత్త బెర్ట్రాండ్ రస్సెల్ 'సృష్టి' రహస్యాన్ని ఛేదించాడు. మానవ జన్మ ఎత్తిన ప్రతి మనిషీ ఏదో ఒక సందర్భంలో అహంకరిస్తుంటాడు. యీ కథ చదివితే ఈ విశాల విశ్వంలో మనమెంత సూక్ష్మాతి సూక్ష్మ క్రిములమో తెలుసుకొని అలా అహంకరించడం ఎంత నికృష్టమో గదా అని ఉలిక్కిపడతాము.

అయిదు నిమిషాలలో చదివేసే పుస్తకమే అయినా జీవితాంతం దాచుకోవాలని పించే ఈ చిన్ని పుస్తకాన్ని మా తేజోవతికి గుర్తుగా....

మేనమామలు

తిరుపతి, -సాకం నాగరాజ

16-05-2013. -సాకం సుధాకర్

**80083 10261**

# జీవితానందం

**-చెహోవ్**

జీవితంలో సుఖాలకన్నా కష్టాలే ఎక్కువ.

అట్లాగని ఆనందంగా జీవించడం అంత కష్టమేమీ కాదు.

ఆనందమంటే కోటి రూపాయల లాటరీ గెలవటమో, ప్రభుత్వం నుండి బిరుదులూ, అవార్డులూ తీసుకోవడమో, మిస్ యూనివర్సును పెళ్లి చేసుకోవడమో కాదు.

క్రమేణా డబ్బూ, కీర్తీ, సుఖాలూ అన్నీ అలవాటుగా మారతాయి. అందువల్ల కష్టాలలో కూడా సుఖాన్ని అనుభవించాలంటే... ఉన్నదాంతో తృప్తిపడాలి, పరిస్థితులు ఇప్పుడున్న దానికన్నా ఛండాలంగా ఉండగలవనుకోవాలి.

జేబులో అగ్గిపుల్లలు భగ్గుమన్నాయనుకో, జేబులో గంధకం లేనందుకు ఆనందించు.

బంధువులు ఇంటి మీదకి దండెత్తి వస్తే, వచ్చింది బంధువులే, పోలీసులు కాదుగా అనుకో.

వేలు తెగితే - కంట్లో గాయం కానందుకు భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకో.

మీ ఆవిడ గాన సాధన యింట్లో నీ వునికిని నరకం చేస్తే - ఎంత చెడ్డా అది గానమే!

కుక్కలు మొరిగితేనే బాధ పడుతున్నావే, గాడిద నీ చెవిలో ఓండ్రిస్తే ఏం చేస్తావు?

బరువులు మోసే పశువ్వీ, గాడిదవీ కాదు. ఊరపందివీ, కుక్కవీ కాదు. ఈగవీ, దోమవీ, నల్లివీ కాదు. నువ్వో మనిషివైనందుకు సంతోషించు.

ఇవన్నీ సంతోషించవలసిన విషయాలు కావూ!

ఇంట్లో వున్నావు. జైల్లో లేవే!

అప్పుల వాళ్లు నీ కాళ్లూ చేతులూ విరిచెయ్యలేదు.

పత్రికల వాళ్లు నీ రచనలు వేసుకొని డబ్బులు ఇస్తామనీ ఇవ్వలేదు. నీ రచనలైతే పది మంది కంట్లో పడ్డాయి గదా!

ఫరవా లేదు, ఊళ్లోనే వున్నావు. సైబీరియా ఎడారిలో లేవు కదా!

ఒక్క పన్నే నొప్పెడుతున్నది. నోరంతా పుచ్చిపోలేదు.

మునిసిపాలిటీ చెత్తబండిని లాగే గుర్రానివి కావు.

నీకిష్టం లేని పేపరు చదవక్కర్లేదు.


ఒక్క భార్యే వున్నది. ముగ్గురు లేరు.

జైల్లో వేశారా, ఇంకా నయం ఖైదీల మధ్యే వున్నావు. తోడేళ్ల గుంపు మీదపడి పీక్కుని తినలేదు గదా!

బెత్తంతో బాదారా. ఫరవాలేదులే, ఇనప కడ్డీతో కాదుగా!

పెళ్లాం చని పోయిందా, నీకే ద్రోహం చేసింది. దేశానిక్కాదుగా!

✡



# కడుపు గాల్చిన కన్న కూతురు

-నామిని

కసిం కాలవ నుంచి ఎనుములు తోలుకోనొచ్చి కొట్టంలో కట్టేస్తా వుంటే నా పెళ్ళామొచ్చి చెప్పింది, "ఏమబ్బా, శారదమ్మ చచ్చిపొయ్యింది."

నా గుండికాయలు నీళ్లయి పొయ్‌నాయి, వొళ్లంతా దద పుట్టిపొయ్యింది.

శారదక్క నాకు తోడ బుట్టిందాంతో సమానం. చెప్పాలంటే నన్నొక ఇంటివాణ్ణి చేసింది శారదక్కే. తనపల్లి దగ్గిర సుబ్రమణ్యం స్వామి గుళ్లో ఆడికృత్తిక రోజున నేను ప్రభావతిని చూసినా. బారడు పొడుగు జడతో పిల్ల కులుకులాడిగా వుంటే, "చేసుకుంటే ఈ లంజనే చేసుకోవాల!" అని పంతంబట్టి అప్పటికప్పుడే ఇంటికొచ్చి పెత్తానానికి మాయమ్మనూ, శారదమ్మనూ జతజేసి ప్రభావతి వాళ్లవూరు పంపించి దాన్ని పెండ్లి చేస్కునేదాకా వొంటి కాలి మిందుండినా.

నా పెండ్లి జేసిన శారదక్కను గురిచ్చి ఈ రకంగా కడుపు కాలే కత చెప్పుకోవాల్సి వస్తాదని అనుకోలేదురా బగమంతుడా!

రెండు చేతల్లో రెండావుల పగ్గాలనూ, నెత్తిన తట్టనూ పెట్టుకుని దినానికి (మా ఇంటి ముందర) తొంభై మార్లు తిరగతా అగచాట్లు పడతా వుండే శారదక్క నాతో ఎప్పుడూ, "నేను పడే తిప్పలన్నీ కతగా రాయేమిరా, ఎనబ్బా!" అని అడిగేది.

శారదక్కకు జెరమొచ్చిందంట. ఏం జేస్తిందిలే, పోతాది – అనుకోని గమ్మనుంటే అది ఒక్క దినానికే మనిసిని నిండా లొంగదీసేసింది. రెండోరోజు డాక్రట దగ్గరికి పోవడం, వాడు సూదెయ్యడం, శారదమ్మ అప్పటికప్పుడే చచ్చిపోవడం–

రెక్కల కష్టంతో బిడ్డల సాక్కునే తల్లుల ప్రాణాలను అంత లేసుగా ఎందుకు తీసక పోతావురా కూలిపాయ్న దేముడా!

ఈ పాపం జేసిన కండ్లతో శారదక్క శవాన్ని చూడబొయ్యేది ఎట్ట?

ఆమె ముగ్గరి బిడ్డలూ ఆమె మింద పడి కొట్టుకుంటా వుంటే నీకు కేళీ విలాసంగా వుంటాదంటరా యెంగటేస్పరా!

శారదక్కింటికి పొయ్నా. పిలకాయల్ను తల్లి దగ్గరికి రానీకుండా ఏయమ్మో వొకమ్మ జాగర్త తీసుకునింది.

మొగుడు నెత్తిన చేతులు బెట్టుకుని – పెళ్లాం చచ్చినోడి మాదిర్తో వుండాడు అనంటారే, నిజ్జంతో అట్టనే వుండాడు.

శారదక్కోళ్ల అమ్మ వొక్కటీ పైనబడి కొట్టుకుంటా వుండాది. ఆమె కూతురి మింద పడి, పాడిన ఏడుపు పాటలో నాలుగు మాటలు చెబ్దామనే ఈ కతను మొదులు బెట్టినా.

శారదక్కకు చిన్నప్పుడు బలే వుక్క పోసేదంట. బిడ్డను చీకటీగలు కుడతాయని బిడ్డ మింద పైటకొంగు కప్పితే ఆ బిడ్డ వుక్కకు పైటకొంగును తొలగదోసేసేదంట. అప్పుడు గాని బిడ్డకు వూపిరి తిరిగేది గాదంట.

ఇదంతా ఆ తల్లి తలుచుకొని –

"ఇప్పుడు నిన్ను బారట్లోతు గుంత తొవ్వి పూడ్చి పెట్టేస్తారు గద కూతరా! పైటకొంగును పైనేస్తేనే వుక్కకు అల్లాడి పోతుంటివే, ఇప్పుడంత లోతు మట్టిలో ఎట్ట పొనుకుంటావే నా అమాయికవైన కూతరా! నా పైటకొంగును తొలగదోసేసి నట్టు, ఆ మట్టిని గూడ తొలగదోసేసి నువ్వు చక్కా వొచ్చి నా వొళ్లో కూచ్చోయే నా పిచ్చి కూతరా! ఇంక నేనెట్ట బూమ్మింద తిరుగులాడేదిరా నా బట్టా దేముడా!" అని పాట పాడి ఎదుర్రొమ్ము కొట్టుకుంటా వుంటే – ఈ దుఃక్కం ఎట్ట బరించేదిరా బగమంతుడా!

# సృష్టి

-బెర్ట్రాండ్ రస్సెల్

ఒకనాడొక ప్రముఖ వేదాంతి తన మరణానంతరం స్వర్గోన్ముఖుడై ప్రయాణిస్తున్నట్టుగా కలగన్నాడు. వివిధ ఆధ్యాత్మిక గ్రంథాలతో పరిచయముండటం వల్ల దారి కనుక్కోవటంలో ఇబ్బందేమీ కలగలేదు. స్వర్గ ద్వారాన్ని తట్టగానే తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా తనను సూక్ష్మ పరిశీలన చేస్తున్న వ్యక్తిని చూసి, "నాకు ప్రవేశం కావాలి... నా పవిత్ర మానవ జీవితమంతా భగవంతుని కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప చేయటానికే ధారపోశాను" అన్నాడు వేదాంతి.

"మానవుడివా! అదేమిటి? నీలాంటి అత్యల్పజీవి భగవంతుని కీర్తి ప్రతిష్ఠలను ఎలా ఇనుమడింప చెయ్యగలదు?" అన్నాడా ద్వారపాలకుడు. వేదాంతికాశ్చర్యం వేసింది. "మీకు మానవుల గురించే తెలియదా? భగవంతుని సర్వోత్కృష్టమైన సృష్టి మానవుడని మీకు తెలుసుండాలే" అన్నాడు.

"మీతో ఏకీభవించలేకపోతున్నందుకు క్షమించండి. కాని మీరు చెబుతున్న ఈ విషయం ఇదివరకెప్పుడూ వినలేదు. 'మానవుడు' అనే జీవి గురించి కూడా ఇక్కడెవరికీ తెలియదనే నా నమ్మకం. అయినా మీరు చాలా కష్టపడి వచ్చినట్టున్నారు గనక, మీకు మా గ్రంథాలయాధికారిని కలిసే అవకాశం మాత్రం ఇవ్వగలను" అన్నాడు ద్వారపాలకుడు. వెయ్యి కళ్లూ, ఒక నోరూ వున్న విచిత్రాకారుడైన గ్రంథాలయాధికారి కొన్ని కళ్ళు వేదాంతివైపు సారించి, "ఇదేమిటి?" అంటూ అడిగాడు ద్వారపాలకుణ్ణి. "ఇదండీ, భూమి అనే చోట వుండే 'మనిషి' అనే జీవజాలానికి సంబంధించిన జీవి అటండీ. సృష్టికర్త ఇవి వుండే చోటు మీదా, తమ మీదా ఏదో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వుంటాడని వీటికో తమాషా అభిప్రాయం వుందండీ! మీరు వీటికేమన్నా విషయాలు తెలియచెబుతారేమోనని తీసుకొచ్చాను" అన్నాడు ద్వారపాలకుడు. గ్రంథాలయాధికారి వేదాంతివైపు దయగా చూసి, "ఈ భూమి అనేది ఎక్కడుందో కాస్త చెబుతారా?" అని అడిగాడు.

"ఆఁ! భూమి సౌరకుటుంబంలోని ఓ గ్రహం" అన్నాడు వేదాంతి.

"ఏ సౌర కుటుంబం?"

"అయ్యబాబోయ్! నేను కేవలం ఆధ్యాత్మిక జ్ఞానంలో మాత్రమే ప్రావీణ్యత సంపాదించాను. మీరు అడిగేవన్నీ భౌతిక విషయాలు. అయినప్పటికీ ఖగోళ

శాస్త్రజ్ఞులైన నా మిత్రులు చెప్పినందువల్ల తెలిసింది. సౌర కుటుంబం పాలపుంతలో ఓ భాగం"

"పాలపుంత అంటే ఏమిటి?"

"పాలపుంత అనేది వందలాది లక్షల నక్షత్ర వీధుల్లో ఒకటి"

"బాగు. బాగు. ఇంత గందరగోళంలో నువ్వు చెప్పేది జ్ఞాపకముంచుకోవటం ఎలా సాధ్యపడుతుంది చెప్పు? ఈ 'నక్షత్ర వీధి' అనే మాట మాత్రం ఎప్పుడో విన్నట్టుగా గుర్తు. మా అసిస్టెంట్లలో ఒకడు 'నక్షత్ర వీధి' విభాగం చూస్తుంటాడు. అతన్తో మాట్లాడి మీ చిరునామా తెలుసుకోవటానికి ప్రయత్నిస్తాను."

దీర్ఘ నిరీక్షణ తర్వాత పన్నెండు తలలున్న నక్షత్ర వీధి విభాగపు అసిస్టెంటు వచ్చాడు. ఒకప్పుడతను శుభ్రంగానే వుండివుంటాడు. కాని ప్రస్తుతం పుస్తకాల బీరువాల దుమ్మంతా కొట్టుకు పోయిందా మొహాల మీద. వేదాంతి తన చిరునామా చెప్పే ప్రయత్నంలో నక్షత్ర వీధి గురించి చెప్పాడనీ, అందువల్ల తమ గ్రంథాలయం లోని నక్షత్ర వీధి విభాగం ఈ విషయంలో ఏమైనా సహాయం చెయ్యగలుగు తుందేమో చూడాలనీ చెప్పాడు గ్రంథాలయాధికారి. వెదుకుతూ పోతే కాలక్రమంలో, యితని జాడ దొరికించుకోవటం అసాధ్యమేమీ కాదు. కాని కొన్ని వందల లక్షల నక్షత్ర వీధులున్నాయి. ఒక్కో నక్షత్ర వీధికీ ఒక్కో సంపుటం వుంది. అందువల్ల కావలసిన సంపుటం వెదికి పట్టుకోవటం ప్రయాసతో కూడిన విషయం. అయినా ఈ సూక్ష్మజీవికేం కావాలట?

"ఏ పాలపుంతో చెప్పాలి" అన్నాడు వేదాంతి. "సరే! ప్రయత్నిస్తాను" అన్నాడు అసిస్టెంటు. ఓ మూడు వారాల తర్వాత తిరిగి వచ్చి తమ లైబ్రరీలోని అతి సమర్థవంతమైన కార్డు యిండెక్సు పద్ధతి వల్ల ఇతడి నక్షత్ర వీధి సంఖ్య $x$...3,21,762 అని తెలుసుకున్నట్టుగా చెప్పాడు. "మన లైబ్రరీలోని ఐదు వేల మంది గుమాస్తాలూ కలిసి వెదికితేగాని కనుక్కోలేక పోయాం. ఈ నక్షత్ర వీధి వ్యవహారాల గుమాస్తాను తీసుకొచ్చాను ఇదిగో" అన్నాడు అసిస్టెంటు. ఎనిమిది తలకాయల ఆ గుమాస్తా, పుస్తకాల బీరువాల చీకటి కలవాటు పడిన కళ్ళతో, వెలుగును చూడలేక కళ్ళు చిట్లించి- "నా నక్షత్ర వీధి గురించి మీకేం సమాచారం కావాలి?" అడిగాడు.

"నాకు నా సౌర కుటుంబం గురించి చెప్పండి. సౌర కుటుంబం అంటే ఒక్కో నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తూ వుండే కొన్ని గ్రహాల సముదాయం. మా గ్రహ

కుటుంబం సూర్యుడనే నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తుంటుంది." అసిస్టెంటు నిట్టూర్చి, "ఫలానా నక్షత్ర వీధి అంటూ తెలుసుకోవటమే కష్టమంటే ఇదొకటా? ఆ ప్రత్యేకమైన నక్షత్రం ఏమిటో కనుక్కోవటం మరింత కష్టతరమైన విషయం. నా నక్షత్ర వీధిలో మూడు వందల కోట్ల నక్షత్రాలున్నాయని నాకు తెలుసు. ఐతే అందులో ఓ నక్షత్రానికీ, మరో నక్షత్రానికీ తేడా మాత్రం నాకే తెలియదు. ఒకప్పుడెప్పుడో పరిపాలన శాఖ వారు మూడు వందల కోట్ల నక్షత్రాల జాబితా అడిగినట్లుగా జ్ఞాపకం. ఆ జాబితా బహుశా మా భూగృహంలో వుందేమో చూస్తాను. ఇంత శ్రమపడటం మీరు అవసరమనుకుంటే ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి వెదికిస్తాను."

"ఎట్లాగూ కొంత పరిశోధన జరిగింది గనకా, వేదాంతి చాలా దిగులు పడుతు న్నాడు గనకా వెదికితే పోతుంది" అనుకున్నారు. అలా కొన్నేళ్ల తీవ్ర పరిశోధన తర్వాత నాలుగు తలకాయల పరిశోధకుడు అసిస్టెంటు వద్దకొచ్చి, "హమ్మయ్య చివరికి మీక్కావలసిన ఆ నక్షత్రం గురించి సమాచారం దొరికింది. ఇదిగోనండి! కాని మీరు దీని గురించి ఎందుకింత ప్రత్యేక శ్రద్ధ చూపించారో అర్థం కావటం లేదు. నక్షత్ర వీధిలోని అసంఖ్యాకమైన ఇతర నక్షత్రాల్లాగే యిదీ వుంది. పరిమాణం లోనూ, ఉష్ణోగ్రతలోనూ యించుమించు వాటిలాగే వుంది. మిగతా వాటికి మల్లేనే కొన్ని గ్రహాల సముదాయం దీని చుట్టూ కూడా తిరుగుతూ వుంది. దీర్ఘ పరిశోధన తర్వాత కొన్ని గ్రహాల మీద కొన్ని పరాన్న భుక్కులున్నట్టుగా పసికట్ట కలిగాను. బహుశా ఇక్కడికొచ్చిన జీవి ఆ పరాన్న భుక్కుల జాతిదేమో!" అన్నాడు.

వేదాంతి దుఃఖం ఆపుకోలేకపోయాడు.

"సృష్టికర్త మాకీ విషయాలిదివరకే ఎందుకు తెలియచెప్పలేదు? ఈ విశ్వాలను సృష్టించింది మా కోసం. నా దీర్ఘ జీవితమంతా భగత్సేవలో గడిపాను. నా సేవకు మెచ్చి, నా భక్తికి కరుణించి నాకు శాశ్వతానందాన్నిస్తాడని నమ్మాను. ఇక్కడ చూస్తేనేమో నేనెక్కిడివాణ్ణో నా చిరునామా కూడా వీళ్లకు తెలియదు. కొన్ని వందల లక్షల నక్షత్ర వీధుల్లోని వందలాది లక్షల నక్షత్రాలలోని, ఒక నక్షత్రం చుట్టూ పరిభ్రమించే ఒక సూక్ష్మ గ్రహం మీద గడిపిన ఒక సూక్ష్మాతి సూక్ష్మ జీవినంటారు వీళ్ళు. ఇది నేను భరించలేను. ఎందుకా సృష్టి కర్తను కొలవాలి? ఎందుకు అతడి లీలల్ని కీర్తించాలి?" అన్నాడు వేదాంతి.

"ఇక వెళ్ళొచ్చు". కల చెదిరిన వేదాంతి - సైతాను మనకెలాంటెలాంటి పీడ కలల్ని కల్పిస్తోందో చూశారా అంటూ గొణుక్కున్నాడు.

✡

Blank page

పుస్తకాల ద్వారా నేను జీవితాన్ని అధ్యయనం చేశాను.
పుస్తకాల్లోనే జీవితాన్ని చూశాను. పువ్వుల సుగంధాల్ని పీల్చుకున్నాను.
పుస్తకాల్లోనే మధువు తాగి మత్తెక్కి పోయాను. సుందరాంగనల పరిష్వంగాల్ని
పుస్తకాల్లో అనుభవించాను. ప్రకృతి అద్భుతాలను దర్శించాను.
జీవితానుభవమంతా పుస్తకాలలో దొరికింది. పర్వత శిఖరాలెక్కాను.
సముద్రపు లోతుల్లో ఈదులాడాను. ఆకాశంలో విహరించాను.
తుఫానుల నధిగమించాను. పిడుగులనూ, మెరుపులనూ ఆహ్వానించాను.
అప్సరసల, బ్రహ్మరాక్షసుల సాంగత్యంలో జీవించాను.
ఆకాశపుటంచులూ, అధోలోకపు చీకటి గహ్వరాలూ నాకు పరిచితాలు.
విశ్వాంతరాళపు నాగరికుణ్ణి నేను.
మానవ మేధోపరిమితులు నాకు అవగతమయ్యాయి.
ఈ చిన్న కంకాళంలో ఎన్ని అనూహ్యమైన రహస్యాలు!
స్వేచ్ఛగా బయట తిరుగుతున్న మీ అందరికన్నా ఎక్కువ జీవితం
పుస్తకాల ద్వారా తెలుసు నాకు.

-చెహోవ్